సమస్యలు తలెత్తకుండా చూడాలి

మన్సూరాబాద్, జూన్ 29: ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన హేమంత కేశవ్‌పాటిల్‌ను శనివారం నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని పలు సమస్యలపై జోనల్ కమిషనర్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. వర్షా కాలంలో లోతట్టు కాలనీల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వీధి దీపాలు, రోడ్లు, యూజీడీ సమస్యలను ఆయనకు వివరించారు. నాయకులు చింతల సురేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యోగా జీవితంలో భాగం కావాలి

సహజ యోగా మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న సోనాలి భట్టాచార్య

ఆర్కేపురం, జూన్ 29 : సంపూర్ణ ఎదుగుదలకు యోగా ఎంతో ముఖ్యమని సహజ యోగా నేషనల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సోనాలి భట్టాచార్య, రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరి కృష్ణ అన్నారు. హైదరాబాద్ రియలైజేషన్ టూర్ పేరుతో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సహజ యోగా మహోత్సవ కార్యక్రమానికి సోనాలి భట్టాచార్య ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అందరి జీవితంలో ఒక భాగం కావాలని సూచించారు. జబర్దస్త్ ఫేమ్ నటులు, మాజీ కోఆర్డినేటర్లు మల్లారెడ్డి, రామ్మోహన్ రావు, సుబ్బిరెడ్డి, కమిటీ మెంబర్స్ సుప్రజ, వినోద్, ప్రమోద్, సభ్యులు సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

- సీఎం రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలు మానుకో..
- రద్దు చేసిన రూ.250కోట్లు విడుదల చేయాలి
- గడ్డం ఇన్‌క్లేవ్ కాలనీలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పర్యటన

గుర్రంగూడ గడ్డం ఇన్‌క్లేవ్ కాలనీలో పర్యటిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జూన్ 29: ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధికి సహకరించాలి తప్ప కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ గడ్డం ఇన్‌క్లేవ్ కాలనీలో శనివారం పర్యటించారు. కాలనీల్లో ఉన్న రోడ్ల దుస్థితిని పరిశీలించారు. కాలనీలన్నీ కలియ తిరిగి కాలనీ వాసులతో మాట్లాడారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పర్చాలని కాలనీ వాసులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ అడిగినన్ని నిధులు ఇచ్చే వారని ఆమె గుర్తు చేశారు. శివారు మున్సిపాలిటీలలో కొత్త కాలనీలు వెళుస్తున్నాయన్నారు. కొత్తగా వెలసిన కాలనీలలో మౌలిక సౌకర్యాలు కల్పించవలసిన బాధ్యత తనపై ఉందన్నారు. ముఖ్య మంత్రి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రద్దు చేసిన రూ. 250 కోట్ల నిధులను విడుదల చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్లన్నీ గుంతల మయంగా మారాయన్నారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలంటే నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకొని గతంలో రద్దు చేసిన నిధులు మంజూరు చేయించాలని ఆమె కోరారు. రోడ్లు గుంతల మయంగా మారడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాజకీయ నేపథ్యంలో నిధులు రద్దు చేయడం మంచిది కాదన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రధాన రహదారులన్నింటికి మరమ్మతులు చేయాలని కమిషనర్‌కు ఆదేశాలు జారీచేశారు. ఎక్కడ కూడా గుంతలు కన్పించవద్దన్నారు. అధికారులు అన్ని రోడ్లను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ రఘుకుమార్‌కు ఆదేశాలు జారీచేశారు. గతంలో కుల సంఘాలకు సంబంధించి స్థలం కేటాయించడం జరిగిందన్నారు. త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కమిషనర్ రఘుకుమార్, డీఈలు యాదయ్య, జ్యోతి, ఏఈ వినీల్ గౌడ్, వంకాయల యాదగిరి, బడంగ్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ గుర్రం సాయి కిరణ్ రెడ్డి, సంరెడ్డి వెంకట్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, కృష్ణ, పుట్టగల్ల రవి, సత్యనారాయణ రెడ్డి, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

వరద నీటి సమస్యలు రాకుండా చూడాలి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య

మన్సూరాబాద్, జూన్ 29: వర్షా కాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై శనివారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య అధ్యక్షతన మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షా కాలంలో లోతట్టు ప్రాంత కాలనీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని డీసీకి కార్పొరేటర్లు సూచించారు. ఎప్పటికప్పుడు మ్యాన్‌హోళ్లు, నాలాల్లో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగింపజేసి మురుగు నీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని కోరారు. సమస్యలను పరిగణలోని తీసుకుని పరిష్కరింపజేస్తానని డీసీ తెలిపినట్లు కార్పొరేటర్లు తెలిపారు.

వనస్థలిపురం: భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర సిబ్బందిని అందుబాటులో ఉంచాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం హయత్‌నగర్ డీసీ తిప్పర్తి యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎంటమాలాజీ విభాగం క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలన్నారు. ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

డీఎస్‌కు నివాళి

సైదాబాద్, జూన్ 29 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ అకాల మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటు అని టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం డీఎస్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నితరంతం పరితపించే ఆయన మృతి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చిందని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కందుకూరు, జూన్ 29 : ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయడానికి కృషి చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తెలిపారు.శనివారం మండల కేంద్రంలో హైదరాబాదు, శ్రీశైలం జాతీయ రహదారిలో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు, లేమూరులో సీసీరోడ్డు, పులిమామిడి, దన్నారం గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా జిల్లాలో నిధులను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి పాండు, మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి, ఎంపీడీవో సరిత, ఏఈఈ సతీశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేందర్‌గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సరికొండ మల్లేశ్, ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్,అందుగుల సత్యనారాయణ, సభావత్ క్రిష్ణనాయక్, వెంకట్‌రమణారెడ్డి, సాయిలు, సురుసాని జైపాల్‌రెడ్డి, రాంరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గుండ్ల సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్‌చారి, యాదయ్య, మూల హన్మంత్‌రెడ్డ, పాండుగౌడ్, ప్రశాంత్, సత్యనారాయణరెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, రాజ మ్మ, జగన్,తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

చంపాపేట, జూన్ 29: లింగోజిగూడ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో తరుచూ తలెత్తుతున్న డ్రైనేజీ విస్తరణ, ముంపునకు గురయ్యే లోతట్టు కాలనీల సమస్య పరిష్కారా నికి పైప్‌లైన్ ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయాలని, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి శనివారం హెచ్ఎండీఏ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

మూసీ సుందరీకరణపై సమీక్ష

అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్, జూన్ 29 : మూసీనది సుందరీకరణ పనుల పురోగతిపై సైదాబాద్, అంబర్‌పేట మండలాల రెవెన్యూ అధికారులతో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం పాతబస్తీ పంజేషాలోని తన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ మూసీనది అభివృద్ధి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మూసీనది సుందరీకరణలో భాగంగా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీ మాట్లాడుతూ సుందరీకరణ పనుల్లో భాగంగా మండల పరిధిలో మూసీనది పరివాహక బాధిత కుటుంబాల సోషల్ ఎకనామికల్ సర్వే నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు 26 కుటుంబాల సర్వే చేశామని, ఈ రోజు నుంచి సర్వే ప్రారంభించినట్లు చెప్పారు. ప్రతి రోజు మధ్యాహ్నం వరకు మండల సిబ్బంది సర్వే చేస్తారని, క్షేత్ర స్థాయిలో సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయటానికి ప్రయత్నాలు చేస్తున్నామని ఆమె వివరించారు. సమావేశంలో సైదాబాద్ డిప్యూటీ తహసీల్దార్ దావూద్ పాల్గొన్నారు.

ఏసీపీ రాజేందర్ పదవీ విరమణ

ఎల్బీనగర్, జూన్ 26: ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం టౌన్‌ప్లానింగ్ విభాగం ఏసీపీ రాజేందర్ పదవీ విరమణ సభ గడ్డిఅన్నారం సాయి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. రాజేందర్‌ను జోనల్ కార్యాలయం సిబ్బందితో పాటుగా ఎల్బీనగర్ జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్ల అధికారులు శాలువాలతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు.

గణేశ్ మండపం కూల్చివేతపై ధర్నా



బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

బడంగ్‌పేట, జూన్29: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ సప్తగిరి కాలనీలో ఉన్న గణేశ్ మండపం వివాద స్పదంగా మారింది. గణేశ్ మండపాన్ని అధికారులు ఉద్దేశ పూర్వకంగానే కూల్చివేశారని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. అధికారులకు, స్థానిక కార్పొరేటర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా అధికారులు వ్యవహరించారని బీజేపీ నాయకులు ఆరోపించారు. బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్ రఘుకుమార్ బీజేపీ నాయకులు చేస్తున్న ధర్నాలో అర్థం లేదన్నారు. గతంలో కాలనీ వాసులు తాత్కాలికంగా షెడ్డు వేసుకుంటామని లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వడం వల్లనే అనుమతి ఇవ్వడం జరిగిందని కమిషనర్ తెలిపారు. ఇటీవల పలు మార్లు కాలనీ వాసులతో చర్చించామన్నారు. కాలనీ వాసుల అభిప్రాయం మేరకే షెడ్డును తొలగించి కొత్త భవనాన్ని నిర్మించానున్నామని కమిషనర్ పేర్కొన్నారు. కాలనీల్లో ఉన్న స్థలం కాలనీ ప్రజల ప్రయోజనాలకు ఉపయోగిస్తామన్నారు. ఈ విషయం పై స్థానిక కార్పొరేటర్ సూర్ణ గంటి అర్జున్ వివరణ కోరగా గణేశ్ మండపాన్ని తొలగించడంలో తన పాత్ర ఏమి లేదన్నారు. కాలనీ వాసుల అంగీకారం ప్రకారమే తొలగించ వలసి వచ్చిందన్నారు. బీజేపీ నాయకులు రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారన్నారు. ధర్నా చేసిన వారిలో మహేశ్వరం నియోజక వర్గం బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు, బీజేపీ నాయకులు నడికూడ యాదగిరి, సామ సంజీవ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శంకర్, ఇంద్రసేనా, వీరకర్ణ, గుండె నాగార్జున, మహేశ్, గుర్రం మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, రామ కృష్ణ, తదితరులు ఉన్నారు.

గృహజ్యోతి పథకం దరఖాస్తుల పరిశీలన

మలక్‌పేట, జూన్ 29: పాత మలక్‌పేట డివిజన్‌లో గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ (జీరో కరెంటు బిల్లుకోసం)ను పొందేందుకు ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన ముమ్మరంగా కొనసాగుతుంది. డివిజన్‌లో ఏర్పాటుచేసిన ప్రజాపాలన దరఖాస్తుల నమోదు కేంద్రానికి కాలనీలవాసులు, బస్తీలవాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయించుకున్నారు. ఆధార్, రేషన్‌కార్డు, కరెంట్ బిల్లు, ప్రజాపాలన దరఖాస్తు రిసిప్ట్‌లను ఫోన్ నంబర్‌తో లింక్‌చేస్తూ సిబ్బంది ఎంట్రీ చేశారు. గృహజ్యోతి పథకానికి అర్హులైన ప్రతిఒక్కరూ ఉచిత విద్యుత్‌ను పొందేందుకు వీలుగా నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ తెలిపారు. డివిజన్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు.

'భ్రమరాంబిక'సేవలు అభినందనీయం

చంపాపేట, జూన్ 29: ఆధ్యాత్మిక చింతనతో ఆలయాల్లో పలు సేవలందించేందుకు శ్రీ భ్రమరాంబిక సేవా సమితి ముందుకు రావడం ఎంతో అభినందనీయమని ధ్యానాంజనేయ స్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక సేవలు అందించేందుకు శనివారం శ్రీ భ్రమరాంబికా సేవా సమితి కోఆర్డినేటర్ ప్రసాద్ ఆధ్వర్యంలో 22 మంది మహిళలు ఆలయానికి వచ్చారు. ఆలయ ధర్మకర్త బబ్బూరి ఆనంద్ గౌడ్, నాయకులు సదానం దరెడ్డి కందికంటి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు నివాళి

నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు, జూన్ 29 : దివంగత సాయిచంద్ సేవలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ అన్నారు. శనివారం వర్ధంతి సందర్భంగా శ్రీశైలం హైదరాబాదు, జాతీయ రహదారిలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు కొమ్మగాల్ల జంగయ్య, రాములు, నర్సింహ, ఎమ్మార్పీస్ నాయకులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్యను పరిష్కరిస్తాం

మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేశ్వరరెడ్డి

వనస్థలిపురం, జూన్ 29 : క్రిస్టియన్ కాలనీ నుంచి సాగర్ రింగ్‌రోడ్డు వరకు వరద మల్లింపునకు ట్రంక్‌లైన్ నిర్మిస్తున్నామని వనస్థలిపురం కార్పొరేటర్ రావుల వెంకటేశ్వర రెడ్డి అన్నారు. శనివారం కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. క్రిస్టియన్ కాలనీ నుంచి అనురాధ కాలనీ, హెచ్‌పీ పెట్రోల్ బంక్ వరకు ట్రంక్‌లైన్ మంజూరై పనులు జరుగుతున్నాయన్నారు. అదే లైన్‌పై సీసీ రోడ్డుకూడా మంజూరైందని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేతులమీదుగా పనులు ప్రారంభం కానున్నాయన్నారు. సాగర్ రహదారి పక్కన ఉన్న ఓపెన్ నాళాను పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు.

పదవీ విరమణ

సైదాబాద్, జూన్ 29 : జువైనల్ వెల్ఫేర్ కరెక్షనల్ సర్వీసెస్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా జువైనల్ డైరెక్టర్ కార్యాలయం ఆవరణలోని రిక్రియేషన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి జువైనల్ కరెక్షనల్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మిర్జా రజా అలీబేగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సర్వసాధారణమన్నారు. పదవీ విరమణ పొందిన ప్రకాశ్, రమేశ్‌లను శాలువాలు కప్పి పూలదండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జువైనల్ వెల్ఫేర్ కరెక్షనల్ సర్వీసెస్ అధికారులు చర్వాక్, గోపీకుమార్, బాలుర సదనాల పర్యవేక్షణాధికారులు నవీన్‌కుమార్, నాగమల్ల నాగేశ్వర్‌రావు, అష్జల్ షాఅలీ, మైథిలీ, జ్వాల పాల్గొన్నారు.

పైసలిస్తేనే.. పర్మిషన్

- సర్కార్ భూముల్లో బహుళ అంతస్తులు
- చూసి చూడనట్లు వదిలేస్తున్న అధికారులు
- టౌన్ ప్లానింగ్ లో ఔట్‌సోర్సింగ్ ఇష్టారాజ్యం

బాలాపూర్ చౌరస్తా ఆర్‌సీఐ రోడ్డులో వెలిసిన అక్రమ నిర్మాణం

బడంగ్‌పేట, జూన్29: అక్రమ నిర్మాణాల విషయంలో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రైవేట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కీలు బొమ్మలుగా మారారు. అక్రమ నిర్మాణాల విషయంలో ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికారుల చేతి వాటం పుచ్చుకుంటే ఎంత పెద్ద భవనం అయినా నిర్మాణం చేసుకోవచ్చు. గురువారం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నందిహిల్స్‌లో పందెం కోడి మార్కెట్ షెడ్డును అధికారులు కూల్చివేయడం పై వివాద స్పదంగా మారింది. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారులు డబ్బులు వసూలు చేయడానికి ప్రైవేట్ వ్యక్తులను అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పెట్టుకొని వ్యవహారం నడిపిస్తున్నట్లు చాలా మంది బాధితులు పేర్కొంటున్నారు. మందమల్లమ్మ చౌరస్తా నుంచి బాలాపూర్ శివారు వరకు నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలకు ఎలాంటి అనుమతులు లేవు. జిల్లెలగూడ నుంచి ప్రశాంత్ హిల్స్, టీచర్ కాలనీ వరకు చాలా భవనాలకు అనుమతులు లేవని తెలుపుతున్నారు. ఇష్టాను సారంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు మాత్రం నోటీసులు జారీచేసి తమ పని అయిపోయిందని చేతులు దులుపుకుంటున్నారు. ప్రభుత్వ భూముల్లో, వక్ఫ్‌బోర్డు భూముల్లో ఎఫ్‌టీఎల్ పరిధిలో అడ్డగోలుగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిస్తున్నాయి. పందెంకోడి మార్కెట్ యార్డు వారు అనుమతి కోసం దరఖాస్తులు చేసుకున్నా కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమతి ఇవ్వలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. బీజేపీ నాయకుడు తిరుపతి రెడ్డి అనుమతి కోసం డబ్బులు తీసుకొని అనుమతి ఇప్పించలేదన్నారు. అధికారులకు డబ్బులు ఇవ్వాలని చెప్పడంతో తాము డబ్బులు ఇవ్వడం జరిగిందని వారు వాపోయారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న పెండ్యాల సత్యనారాయణ, మైకాంత్ అనే ఇద్దరు వ్యక్తులు వసూల్ రాజాలుగా మారారని చాలా మంది బాధితులు పేర్కొంటున్నారు. వారికి డబ్బులు ఇవ్వకపోతే ప్రైవేట్ వ్యక్తుల ద్వారా కమిషనర్, టౌన్ ప్లానింగ్ వారికి ఫిర్యాదు చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. సెల్లార్‌తో సహ బహుళ అంతస్తులు నిర్మిస్తుంటే ఏ ఒక్కరి భవనం కూల్చిన సందర్భాలు లేవని స్వయంగా కార్పొరేటర్ చెబుతున్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కార్పొరేటర్లు, కలెక్టర్‌కు, సీడీఎంఏ, తహసీల్దార్, కమిషనర్ కు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా ఎవరు పట్టించుకోలేదన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్‌లో విలీనం అవుతుందన్న ఆలోచనతో అందిన కాడికి దండు కోవాలన్న ఆలోచనతో అధికారులు పనిచేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కోర్టు ఆదేశాల మేరకు కూల్చివేతలు

ఈ విషయం పై కమిషనర్ చంద్రశేఖర్, టౌన్ ప్లానింగ్ అధికారులను వివరణ కోరగా అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇస్తున్నామని తెలిపారు. ఎన్ని నోటీసులు ఇచ్చామో సమయం తీసుకొని చెబుతామన్నారు. ప్రస్తుతం నోటీసుల జాబితా లేదని చెబుతున్నారు. తర్వాత ఇస్తామని దాట వేశారు. కోర్టు ఆదేశాలు ఉన్న వాటిపై మాత్రం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ భూములలో వెళుస్తున్న అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తామని పై అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అక్రమంగా వేసిన ఫెన్సింగ్ పరిశీలన

ఫెన్సింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మన్సూరాబాద్, జూన్ 29: మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారాస్టేట్స్‌కాలనీ మొదటి గేటు సమీపంలోని కమలానగర్‌లో ఉన్న సుమారు వెయ్యి గజాల జీహెచ్ఎంసీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ (విజిలెన్స్) ఏఈ సతీశ్, హయత్‌నగర్ టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. స్థలంలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ విషయంపై స్థానిక కాలనీవాసులతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన వ్యక్తుల నుంచి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. భవనం అనుమతి సమయంలో సమర్పించిన డాక్యుమెంట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. గ్రీనరీ పేరుతో భవనం ముందు ఉన్న సుమారు వెయ్యి గజాల స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని కమలానగర్ కాలనీవాసులు అధికారులకు తెలియజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.